సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 24 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.20 పలికింది. మార్కెట్‌కు 3,850 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.



జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

27 నుంచి ఇసుక తవ్వకాలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్

పుట్టపర్తి అర్బన్: తాడిమర్రి మండలంలోని ఇసుక రీచ్‌లలో ఈనెల 27 నుంచి ఇసుక తవ్వకాల పనులు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ఇసుక సరఫరా, రీచ్‌ల్లో తవ్వకాల పనులపై రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద వాహన రద్దీ లేకుండా చూస్తామని, ఇసుక లభ్యతపై ఎప్పటికప్పుడు నివేదిక పంపుతామని కలెక్టర్ తెలిపారు. అలాగే ఇసుక రవాణాలో సమస్యలు, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేశామని మైన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి తెలిపారు. తాడిమర్రి మండలంలోని సీసీరేవు–సీ, సీసీ రేవు–డి రీచ్‌ల వద్ద ఇసుక తవ్వకాల పనులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. వీసీలో మైన్స్ ఏడీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి కృషి

- అడిషనల్ ఎస్పీ విష్ణు



ఓ కానిస్టేబుల్ సమస్య వింటున్న అడిషనల్ ఎస్పీ విష్ణు

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో నిమగ్నమై ఉండే పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అడిషనల్ ఎస్పీ విష్ణు తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ నిర్వహించారు. బదిలీలు, సస్పెన్షన్ ఎత్తివేత, సరెండర్ లీవ్, తదితర సమస్యలపై 11 మంది అర్జీలిచ్చారు. అడిషనల్ ఎస్పీ విష్ణు పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్ మల్లికార్జున, ఏఓ సుజాత, ఆర్‌ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి మున్సిపాలిటీలో విజిలెన్స్ దాడులు

- పలు రికార్డులు స్వాధీనం చేసుకున్న అధికారులు



కమిషనర్ చాంబర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పుట్టపర్తి టౌన్: అవినీతి ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు మున్సిపాలిటీ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. చెత్త తరలింపు, వాహనాల మరమ్మత్తులు, డీజిల్ కొనుగోలుకు సంబంధించి నకిలీ బిల్లులు తదితర వాటితో పాటు ఆస్తి, నీటి పన్నుల్లోనూ అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం విజిలెన్స్ అధికారి రాజశేఖర్ నేతృత్వంలో విజయలక్ష్మి, శివప్రసాద్, చంద్ర తదితరులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోని పలు రికార్డులు పరిశీలించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. సమగ్ర విచారణ తర్వాత చర్యలు ఉంటాయని విజిలెన్స్ అధికారి తెలిపారు. విజిలెన్స్ అధికారుల తనిఖీల నేపథ్యంలో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఐటీఐ ప్రవేశాలకు మూడో విడత కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించిన మొదటి, రెండు విడతల కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 26లోగా iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏ ఐటీఐ చేరాలనుకున్నారో అదే ఐటీఐని ఆన్‌లైన్‌లో ఎంచుకోవచ్చని వెల్లడించారు.

భద్రత కల్పించాలి



కోల్‌కతాలో జూనియర్ మహిళా వైద్యురాలిపై జరిగిన పాశవిక సంఘటన దుర్మార్గం. ప్రాణాలు పోసే వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకపోతే ఎలా..? సమాజంలోనూ మార్పు రావాలి. ప్రభుత్వాలు కూడా ఆస్పత్రుల వద్ద మహిళా వైద్యులు, సిబ్బందికి భద్రత కల్పించాలి. ప్రత్యేకంగా మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలి. ప్రతి పీహెచ్‌సీకి నైట్ వాచ్ మెన్‌ను నియమించాలి. క్వార్టర్స్ వద్ద కూడా సదుపాయాలు కల్పించాలి.

– శాంతి, మెడికల్ ఆఫీసర్, గుండుమల



సమాజంలో మార్పు రావాలి

కోల్‌కతా ఘటన చాలా బాధాకరం. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు రూపొందిస్తున్నా ఆచరణలో కనిపించడం లేదు. మంచి, చెడును అమ్మాయిలకే కాదు అబ్బాయిలకూ చెప్పాలి. అది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి. అంతిమంగా సమాజంలో మార్పు వస్తేనే అమ్మాయిలకు భద్రత సాధ్యం. ఆస్పత్రుల్లోనూ మహిళా సిబ్బందికి భద్రతతో పాటు సౌకర్యాలను కల్పించాలి. ప్రధాన ఆస్పత్రుల వద్ద రాత్రి వేళల్లో పోలీసులు ఉండే విధంగా చూడాలి.

– సరస్వతి, హెల్త్ సూపర్‌వైజర్, కల్లుమర్రి పీహెచ్‌సీ, మడకశిర మండలం



ఖాకీవనంలో కలుపు మొక్కలు

- చేతివాటంతో శాఖ పరువు తీస్తున్న పోలీసులు
- సీజ్ చేసిన వాహనాల విడిభాగాలు మాయం
- కొందరి నిర్వాకంతో పోలీసు శాఖకే మచ్చ
- తాజాగా అగళి మండలంలో వెలుగు చూసిన ఘటన
- గతంలో హిందూపురం, చిలమత్తూరులోనూ ఇదే తతంగం



సాక్షి, పుట్టపర్తి

దొంగలతో సహవాస దోషమో... ఈజీ మనీకి అలవాటు పడటమో తెలియదు గానీ, దొంగలను పట్టుకోవాల్సిన పోలీసుల్లో కొందరు దొంగలుగా మారుతున్నారు. స్వప్రయోజనాల కోసం దారి తప్పుతూ శాఖకే మచ్చ తెస్తున్నారు. గతంలో పోలీసులపై సివిల్ పంచాయితీలు, సెటిల్‌మెంట్లలో జోక్యం, రాజకీయ నాయకులకు అనుకూలంగా వ్యవహరించడం తదితర ఆరోపణలు వచ్చేవి. కానీ ఇప్పుడు ఏకంగా బహిరంగంగా దొంగతనాలకు దిగుతున్నారు. గురువారం అగళిలో వెలుగు చూసిన ఘటనే ఇందుకు నిదర్శంగా మారింది. సీజ్ చేసిన వాహనం విడిభాగాలను తీసుకువెళ్లిన ఓ హెడ్‌కానిస్టేబుల్... తన వాహనానికి అమర్చుకుంటూ దొరికిపోయాడు. ఆయన బాటలోనే చాలా మంది నడుస్తున్నట్లు తెలుస్తోంది.

వాహన విక్రయాల్లో చేతివాటం..

ఏదైనా కేసులో సీజ్ చేసిన వాహనాలపై దొంగల కంటే ముందు పోలీసులే కన్నేస్తున్నారు. ఆయా కేసులు నెలల పాటు కోర్టుల్లో సాగుతుండగా.. అప్పటి వరకు సీజ్ చేసిన వాహనాలను స్టేషన్ ఆవరణలోనే ఉంచుతారు. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు పోలీసులు సీజ్ చేసిన వాహనం విడిభాగాలను రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. ఇంకొందరు వాహనాలనే ఏకంగా బయటికి తెచ్చి విడిభాగాలుగా విక్రయిస్తున్నారు. వాహన యజమానులు కనుగొని.. 'ఇది నా వాహనం' అని నిలదీస్తే.. తాను వేరే వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు సమాధానం చెబుతున్నారు. అక్కడి నుంచి స్టేషన్‌కు వెళ్తే.. అక్కడ వాహనమే లేదని సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారు.

కమీషన్ల వాటాలో గొడవలు..

చెక్‌పోస్టుల్లోని సిబ్బంది వాటాల కోసం అర్ధరాత్రి సమయాల్లో గొడవలకు దిగుతున్నారు. ఒకరు కమీషన్ తీసుకుని వాహనాన్ని వదిలేస్తే.. కొంచెం ముందుకు రాగానే మరొకరు అదే వాహనం ఆపి తనిఖీ చేస్తున్నారు. కోడి పందేలు, మట్కా, పేకాట ఆడే స్థావరాలు తెలిసినా.. కమీషన్లు తీసుకుని మౌనం పాటిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అదును చూసి రెచ్చిపోతున్న దొంగలు..

పోలీసుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలే చోరీలకు తెగబడుతున్నారు. మూడు నెలల క్రితం కొత్తచెరువులో పోలీస్ స్టేషన్ చుట్టుపక్కలే నాలుగైదు చోరీలు జరిగాయి. నెల రోజుల నుంచి హిందూపురంలో పదిపైగా దొంగతనాలు వెలుగు చూశాయి. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో కలెక్టర్ బంగ్లా మొదలు.. అధికారుల ఇళ్లు, మెడికల్ షాపుల్లో చోరీలు... పట్టణంలో చైన్ స్నాచింగ్‌లు విపరీతంగా వెలుగు చూస్తున్నాయి.

ఉపేక్షించేది లేదు



పోలీసు శాఖకు ఎవరు చెడ్డపేరు తెచ్చినా ఉపేక్షించం. జిల్లాలో చోరీలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేక బలగాలు రంగంలోకి దింపాం. సీజ్ చేసిన వాహనాల మాయంతో పాటు.. పోలీసు శాఖలో పని చేస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై విచారణ చేయిస్తాం. నేరం రుజువయితే తప్పక చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదు.

– వి.రత్న, ఎస్పీ

ఇటీవల వెలుగు చూసిన ఘటనలు..

- సీజ్ చేసిన వాహనానికి సంబంధించిన విడిభాగాలను తన వాహనానికి అమర్చుకుంటూ అగళి హెడ్‌కానిస్టేబుల్ సదరు వాహన యజమానికే దొరికిపోయాడు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.
- రెండు నెలల క్రితం చిలమత్తూరు పోలీసులు సీజ్ చేసి స్టేషన్ ఆవరణలో ఉంచిన బైక్‌తో బయటి వ్యక్తి రోడ్డుపై తిరుగుతుండగా.. యజమాని కనుగొని పోలీసులను ఆశ్రయించాడు.
- ఎన్నికల సమయంలో కొత్తచెరువు పరిధిలో కర్ణాటక మద్యం పట్టుబడగా.. ఆ వ్యక్తిని బస్సులో రమ్మని చెప్పి.. పోలీసులు వెళ్లి పోయారు. ఆ తర్వాత కేసు లేకుండా చేశారు.
- నెలన్నర క్రితం కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో ఓ కానిస్టేబుల్ కర్ణాటక మద్యం అక్రమంగా సరఫరా చేస్తుండగా.. ఎస్‌ఐ వెంబడించి పట్టుకున్నారు.
- నాలుగు రోజుల క్రితం కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో వాహనాల తనిఖీల్లో భాగంగా కమీషన్లు తీసుకుని వదిలేస్తున్నారంటూ అటవీ శాఖ సిబ్బంది, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.
- పరిగిలో ప్రైవేటు వ్యక్తులు పోలీసుల పేరిట చలామణి అవుతున్నారు. పేకాట, కర్ణాటక మద్యం రవాణాపై దాడులు చేసి గొడవలకు దిగారు. దీనిపై పోలీసులు నోరుమెదపడం లేదు.

అగళి హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

పుట్టపర్తి టౌన్: అగళి హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులును సస్పెండ్ చేస్తూ ఎస్పీ రత్న శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓ కేసులో సీజ్ చేసి స్టేషన్ ఆవరణలో ఉంచిన బైక్ విడిభాగాలను తన వాహనానికి అమర్చుకునే క్రమంలో రామాంజనేయులు వాహన యజమానికి దొరికిపోయారు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఎస్పీ రత్న... ప్రాథమిక విచారణ మేరకు రామాంజనేయులును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అదుపులోకి రాని అతిసారం

- గుడిబండ మండలం కొంకల్లులో కొత్తగా నాలుగు కేసులు
- రొళ్ల మండలం ఎం.రాయాపురంలోనూ మూడు కేసులు



వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులను పరీక్షిస్తున్న డీపీఎంఓ కుళ్లాయప్ప నాయక్, వైద్య సిబ్బంది

గుడిబండ/రొళ్ల: అతిసారం ఇంకా అదుపులోకి రాలేదు. వైద్య, ఆరోగ్యశాఖ గ్రామంలో వైద్య శిబిరాలు కొనసాగిస్తూ ప్రజలకు సూచనలు ఇస్తున్నప్పటికీ కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. గుడిబండ మండలం కొంకల్లులో ఇప్పటికే అతిసారంతో ఏడుగురు మృతి చెందగా, పదుల సంఖ్యలో గ్రామస్తులు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అలాగే రొళ్ల మండలం ఎం.రాయాపురంలోనూ ముగ్గురు మృతి చెందారు. తాజాగా శుక్రవారం కొంకల్లులో నాలుగు కేసులు, రొళ్ల మండలం ఎం.రాయాపురంలో మూడు కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. బాధితులకు స్థానిక వైద్య శిబిరాల్లోనే చికిత్స అందిస్తున్నారు. డీపీఎంఓ కుళ్లాయప్ప నాయక్, వైద్య సిబ్బంది కొంకల్లులో ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. ఈ సందర్భంగా అతిసారం బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యలను ప్రజలకు వివరించారు. సర్పంచ్ కవిత, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, వైద్య సిబ్బందితో కలిసి 'దోమకాటు మనిషికి చేటు' అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇక రొళ్ల మండలం ఎం.రాయాపురంలో మడకశిర డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికులతో దోమల నివారణ కోసం మందును పిచికారీ చేయించారు. ఎంపీపీ కవిత గ్రామంలో పర్యటించి అతిసారం బాధితుల ఆరోగ్య పరిస్థితి, వ్యాధి తీవ్రతను అడిగి తెలుసుకున్నారు.

27న ఖాద్రీ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 27న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆ రోజు శ్రీవారి సన్నిధిలో అభిషేకాలు ఉంటాయని, రాత్రి రంగమండపంలో శ్రీవారికి ఉయ్యాలోత్సవం నిర్వహిస్తామన్నారు. 28వ తేదీ రాత్రి ఆలయం ఎదుట ఉట్లోత్సవం ఉంటుందని ఈఓ వెల్లడించారు.

30న సామూహిక వరలక్ష్మీ వ్రతం

ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన సామూహిక శ్రావణ వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో పాల్గొన దలచిన వారు ముందుగా ఆలయంలో 28వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 30వ తేదీ (శుక్రవారం) ఉదయం 9.30 గంటలకు కలశపూజ, 10 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం ఉంటుందన్నారు. వ్రతంలో పాల్గొనాలనుకునే వారు కలశము, పూజా సామగ్రి, పూలు, పండ్లు తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు.

స్ఫూర్తి ప్రదాత ప్రకాశం పంతులు

- టంగుటూరి జయంతి వేడుకల్లో కలెక్టర్ చేతన్



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు అందరికీ స్ఫూర్తి ప్రదాత అని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం టంగుటూరి జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని ఆ మహనీయుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకాశం జిల్లా వినోదరాయుని పాలెంలోని ఓ నిరుపేద కుటుంబంలో పుట్టిన ప్రకాశం పంతులు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని తుపాకీ గుండుకు తన గుండెను చూపిన ధీశాలి టంగుటూరి అని కొనియాడారు. అనంతర కాలంలో ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ప్రజలకు విశేష సేవలందించారని గుర్తు చేశారు. తన హయాంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆచరించాలన్నారు. ఆయన చరిత్రను విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ భాగ్యరేఖ, సీపీఓ విజయ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు శివరంగ ప్రసాద్, మోహన్‌రాం, నిర్మలాజ్యోతి, డ్వామా పీడీ విజయ ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్ భూముల పరిశీలన

- చెక్ లిస్టులో మార్పులు చేయాలని సీసీఎల్‌ఏ ఏసీ ఆదేశం



ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న సీసీఎల్‌ఏ ఏసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

బత్తలపల్లి: అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) పొంది ఇతరులకు విక్రయించిన భూములను సీసీఎల్‌ఏ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పరిశీలించారు. శుక్రవారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డితో కలిసి మండలంలోని పోట్లమర్రి గ్రామంలో పర్యటించారు. సర్వే నంబర్ 392–2లో ఫ్రీ హోల్డ్ భూమిని ఇతరులకు విక్రయించడంతో క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రెండో రోజు వీఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల రీ వెరిఫికేషన్ చెక్ లిస్టులను పరిశీలించారు. చెక్ లిస్టులో చేయాల్సిన మార్పులు, చేర్పులను వివరించారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన ఫ్రీ హోల్డ్ భూములన్నింటిపైన త్వరతగతిన రీ వెరిఫికేషన్ చేసి చెక్ లిస్టులను అందజేయాలని ఆదేశించారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు

ఫ్రీ హోల్డ్ భూములను ఎవరైనా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే అలాంటి వాటిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సీసీఎల్‌ఏ ఏసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వీఆర్‌ఓలతో సమీక్ష అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రీ వెరిఫికేషన్ చేసే సమయంలో ప్రత్యేక ఫారంలో వివరాలన్నింటినీ సవివరంగా నమోదు చేయాలని వీఆర్‌ఓలకు సూచించినట్లు వెల్లడించారు. అధికారుల వెంట ఇన్‌చార్జ్ తహసీల్దార్ నటరాజన్, సర్వేయర్ జోసఫ్, పలువురు వీఆర్‌ఓలు ఉన్నారు.

గ్రామ వికాసమే ప్రభుత్వ ధ్యేయం



లేపాక్షి గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- గ్రామ సభలో కలెక్టర్ టీఎస్ చేతన్

లేపాక్షి: సమస్యలు పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శుక్రవారం ఉదయం లేపాక్షి గ్రామ సచివాలయ ఆవరణలో సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఆయనకు అయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ సభల ద్వారా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై గ్రామ సభల్లో చర్చించి గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రజలు చేయి చేయి కలిపి గ్రామాభివృద్ధికి సమష్టి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఏ అభివృద్ధి పనికైనా సర్పంచ్ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు ఆరా తీయగా, వారపు సంత నిర్వహించే ప్రాంతంలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని, గొంగటిపల్లిలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని కోరారు. అలాగే సాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వర్షపు నీటిని సంరక్షించేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కళలు, ఆహార పదార్థాలు, వస్త్రాల తయారీకి మన గ్రామాలు ప్రత్యేకమని వాటిని గ్రామ సభల్లో గుర్తించి ప్రచారం కల్పించాలన్నారు. లేపాక్షి మండలంలో పట్టు, పశుపోషణ, డెయిరీ, పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. సభలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రలో పెరుగుతున్న నీటి మట్టం



బొమ్మనహాళ్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో 35 టీఎంసీల నీటిని నదిలోకి విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఎగువ నుంచి వరద వస్తుండడంతో డ్యాంలో క్రమక్రమంగా నీటి మట్టం పెరుగుతోంది. గేటు మరమ్మతుల తర్వాత 70 టీఎంసీలు ఉన్న నీటి మట్టం శుక్రవారం నాటికి 83.249 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుతం తుంగభద్రకు 37,489 క్యూసెక్కుల వరద వస్తుండగా వివిధ కాలువలకు 9,488 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేస్తున్నారు. డ్యాం నిండాలంటే మరో 20 టీఎంసీల నీరు రావాలి. మరో 10 రోజులు వరద ఇలాగే కొనసాగితే డ్యాం నిండుతుందని తుంగభద్ర బోర్డు అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే 19వ గేటు స్థానంలో స్టాప్‌లాక్ అమర్చిన దృష్ట్యా నీటి నిల్వ 90 టీఎంసీలకు పరిమితం చేసే అవకాశం ఉంది.

క్లుప్తంగా

గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య


గుర్తు తెలియని మహిళ మృతదేహం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఎన్‌ఎస్‌గేట్ వద్ద గుర్తు తెలియని మహిళ గురువారం అర్ధరాత్రి సమయంలో రైలు కింద పడి ఆత్యహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న హిందూపురం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో గూడ్స్ రైలు కింద పడేందుకు సిద్ధంగా ఉన్న మహిళను లోకో పైలెట్ గమనించి అప్రమత్తమై గూడ్స్‌ను ఆపేశాడు. అప్పటికే ఇంజన్ ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. అనంతరం ఆమెను నాగసముద్రం రైల్వే గేట్ వద్దకు చేర్చి, గేట్‌మెన్ల సాయంతో 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి చేరేలా చర్యలు తీసుకున్నాడు. అయితే ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఘటనపై హిందూపురం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27641, 94412 38182కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

వంకలో పడి వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి: ప్రమాదవశాత్తు వంకలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లికి చెందిన ఎరికల శీనప్ప (43) కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో భార్య మృతి చెందింది. అప్పటి నుంచి తాగుడుకు బానిసై మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయాడు. శుక్రవారం గ్రామ సమీపంలోని వంకలో శీనప్ప మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడు చేరుకుని పరిశీలించారు. మద్యం మత్తులో చేపలవేటకు వెళ్లి, ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెంది ఉంటాడని ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మృతుడి అన్న గుర్రప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాము కాటుతో యువకుడు...


చిన్నరాయుడు (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని కొంగనపల్లికి చెందిన చిన్నరాయుడు (30) పాముకాటుతో మృతి చెందాడు. మూడు రోజుల క్రితం వర్షంలో బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఆయనను పాము కాటు వేసింది. ఆ సమయంలో చుట్టుపక్కల గాలించినా ఏమీ కనిపించకపోవడంతో ఇంటికి చేరుకున్న ఆయన భోజనం ముగించుకుని తన పనుల్లో నిమగ్నమయ్యాడు. కాసేపటి తర్వాత అస్వస్థతకు గురి కావడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు వెంటనే గుత్తికి తీసుకెళ్లి నాటు వైద్యం చేయించి ఇంటికి పిలుచుకొచ్చారు. రెండు రోజుల పాటు ఇంట్లోనే ఉన్న చిన్నరాయుడు... ఎంతకూ తగ్గని కాలి నొప్పి నయం కావాలంటూ పులివెందుల సమీపంలో ఉన్న అమ్మవారి దర్శనం కోసం శుక్రవారం బయలుదేరాడు. మార్గమధ్యంలో పరిస్థితి విషమించి మృతిచెందాడు.ఆయనకు భార్య నాగవేణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



మాకే భద్రత లేకపోతే ఎలా?

కోల్‌కతా ఘటన నిజంగా చాలా దురదృష్టకరం. ఆపద సమయంలో ప్రాణాలు కాపాడుతున్న మాకే భద్రత లేకుండా పోతోంది. పీహెచ్‌సీల్లో రోజూ భయపడుతూనే విధులు నిర్వర్తిస్తున్నాం. రాత్రి సమయంలో వచ్చిపోతున్న తాగుబోతులను అడ్డుకునేవారే ఉండడం లేదు. వైద్యులు, సిబ్బంది భద్రత కోసం ప్రతి ఆస్పత్రిలోనూ ఇద్దరు చొప్పున కానిస్టేబుళ్లను 24 గంటలూ బందోబస్తులో ఉంచాలి.

– ఎం.హరిత, వైద్యాధికారిణి, తాడిమర్రి



చాలా భయపడుతున్నారు

రోజూ ఏదో ఒక ప్రాంతంలో వైద్యులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఇది దురదృష్టకరం. అత్యవసర సేవల్లో పాల్గొనే వైద్యులకు, సిబ్బందికి సరైన రక్షణ లేకపోవడంతో చాలా మంది భయపడుతున్నారు. భద్రత కల్పిస్తే రాత్రి సమయాల్లో మరిన్ని నాణ్యమైన సేవలు అందుబాటులోకి తీసుకురావచ్చు. ప్రశాంత వాతావరణంలో రోగులకు చికిత్స అందించే రోజులు రావాలి.

– డాక్టర్ సుప్రవీణ్, ఐఎంఏ కార్యదర్శి, హిందూపురం



భద్రత, వసతులు కల్పించాల్సిందే..

- జీఎంసీ ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు తేల్చి చెప్పిన ఆప్ జూడాలు
- సర్దుబాటు చేస్తాం... రోగుల సేవల్లో పాల్గొనండంటూ యాజమాన్యం అభ్యర్థన


జూడాలతో మాట్లాడుతున్న జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం మెడికల్: భద్రత పరంగానూ.. మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టమైన హామీనిచ్చే వరకూ సమ్మె విరమించేది లేదని ఆప్ జూడా అధ్యక్షుడు డాక్టర్ హరికిరణ్ స్పష్టం చేశారు. శుక్రవారం సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని సూపరింటెండెంట్ చాంబర్‌లో ఆప్ జూడా అధ్యక్షుడు హరికిరణ్, నాయకులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పవన్‌కుమార్, తదితరులతో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ప్రభుత్వ మెడికల్ కళాశాల (జీఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్, రేడియాలజిస్టు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా పీజీ విద్యార్థులు తమకు విశ్రాంతి గదులతో పాటు తాగునీటి సదుపాయం, క్యాంటీన్ వసతి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో విశ్రాంత గదులకు సంబంధించి ప్రస్తుతానికి ఎమర్జెన్సీ వార్డు పై భాగం, అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్ పై భాగంలో ఉన్న గదులను వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. మౌలిక సదుపాయాల కల్పన అంశానికి సంబంధించి ముగ్గురు హెచ్‌ఓడీలతో కూడిన త్రిసభ్య కమిటీను ఏర్పాటు చేస్తున్నామని, వారితో చర్చించి తదుపరి నిర్ణయానికి రావాలని తెలిపారు. దీనిని జూనియర్ డాక్టర్లు వ్యతిరేకిస్తూ సమ్మె యథావిధిగా కొనసాగిస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, శుక్రవారం ఉదయం ఆస్పత్రి ఆవరణలోని శిబిరంలో నిరసన తెలుపున్న జూడాలతో జీఎంసీ ప్రిన్సిపాల్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె విరమించారని, ఇలాంటి తరుణంలో ఇక్కడ కూడా సమ్మె విరమించి విధులకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పీజీ వైద్య విద్యార్థులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్


ఎస్పీ రత్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ

పుట్టపర్తి టౌన్: నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్పీ వి.రత్నను శుక్రవారం ఉదయం ఆమె చాంబర్‌లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో వైఎస్సార్‌సీపీ నేతలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని అభ్యర్థించారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి


ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ సైన్యాలకు ఎదురొడ్డి నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు పోరాటం స్ఫూర్తిదాయకమని ఎస్పీ రత్న కొనియాడారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద ఎస్పీ ఘనంగా నివాళులర్పించి, మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్ల షోరూంలో దొంగల హల్‌చల్

- మూడు రోజుల కిందట సోములదొడ్డి సమీపంలో ఘటన


సీసీ కెమెరాలో రికార్డయిన దొంగల కదలికలు

రాప్తాడు రూరల్: కత్తులు చేతబట్టిన ఇద్దరు దొంగలు అనంతపురం నగర శివారులోని ఓ కార్ల షోరూంలో అర్ధరాత్రి హల్‌చల్ చేయడం కలకలం రేపుతోంది. మూడు రోజుల కిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలోని నెక్సా షోరూంలో అర్ధరాత్రి ఇద్దరు దొంగలు ప్రవేశించి కలియ తిరిగారు. చేతుల్లో కత్తులు పట్టుకుని వివిధ గదుల్లో సోదాలు చేశారు. కత్తుల లాంటి ఆయుధాలు పట్టుకుని రావడం చూస్తుంటే పొరబాటున ఎవరైనా ఉంటే హతమార్చేందుకు కూడా వెనుకాడరనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. దొంగలకు నగదు, విలువైన వస్తువులేవీ దొరకపోవడంతోనే షోరూం నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

బత్తలపల్లి: వ్యవసాయ పరికరాలు అపహరించకెళ్లిన కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్ఐ శ్రీనివాసులు వెల్లడించారు. మండలంలోని గంటాపురం నివాసి నాదెండ్ల రంగస్వామి పొలంలో మూడు రోజుల క్రితం డ్రిప్ పైపులు చోరీ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రభాకర్ నేతృత్వంలో లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పక్కా ఆధారాలతో ముగ్గురిని శుక్రవారం అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో కనగానపల్లి మండలం భానుకోటకు చెందిన వడ్డే భూపతిరాజు, బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లికి చెందిన సిద్ద రామమోహనరెడ్డి, అనంతపురంలోని వినాయక్‌నగర్‌కు చెందిన పల్లా జగదీశ్వర్ ఉన్నారు. వ్యసనాలకు బానిసైన వీరు తమ జల్సాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం పొలాల్లో అమర్చిన డ్రిప్ పరికరాలను అపహరించుకెళ్లి గుజరీకి విక్రయించి సొమ్ము చేసుకునేవారిగా నిర్ధారణ అయింది. వీరి ఉంచి ఆరు కట్టల అన్‌లైన్ డ్రిప్ పైపులు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బోడిసానిపల్లిలో కూలిన మిద్దె


కూలిన మిద్దె


గాయపడిన ఉదయ్‌కుమార్

- నలుగురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన భాగ్యలక్ష్మి, పార్వతి

వజ్రకరూరు: మండలంలోని బోడిసానిపల్లిలో శుక్రవారం రాత్రి మట్టి మిద్దె కూలింది. ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలకు మిద్దె పూర్తిగా తడిసింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భోజనం ముగించుకుని నిద్రకు ఉపక్రమిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలింది. శిథిలాల కింద చిక్కుకున్న పార్వతి, రాజేష్, భాగ్యలక్ష్మి, ఉదయ్‌కుమార్‌ను గ్రామస్తులు వెలికి తీసి, 108 అంబులెన్స్ ద్వారా గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా... ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ నరేష్... బోడిసానిపల్లికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

గ్రామసభలో కూటమి నేతల ఘర్షణ

చిలమత్తూరు: మండలంలోని మొరసలపల్లిలో శుక్రవారం జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామ సభలో బీజేపీ, టీడీపీ నేతలు ఘర్షణ పడ్డారు. సభ ప్రారంభం కాగానే బీజేవైఎం నేత సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి పథకం కింద గ్రామంలో వెయ్యి జాబ్ కార్డులు ఉంటే.. ఇందులో 600 కార్డులను తొలగించారని తెలిపారు. కార్డులు తొలగించిన వారికి విషయం తెలిపి, మళ్లీ వాడుకలోకి తీసుకువచ్చే ప్రయత్నం ఎందుకు చేయడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ ఇమామ్‌ను నిలదీశారు. ఆ సమయంలో టీడీపీ నేత అంజి కల్పించుకుంటూ ఇంటింటికీ వెళ్లి బొట్టు పిలవాల్సిన అవసరం లేదని, జాబ్‌కార్డుల విషయంగా అడగడానికి నీవెవరూ అంటూ కవ్వింపు చర్యలకు దిగాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఒకానొక దశలో పరిస్థితి అదుపు తప్పుతుండగా సభను అర్ధంతరంగా ముగించేశారు.

'ఫెడ్‌ఎక్స్' పేరిట నేరాలు

- అపరిచిత కాల్స్‌కు స్పందించొద్దు : అనంత ఎస్పీ



అనంతపురం సెంట్రల్: ఫెడ్ ఎక్స్ కొరియర్ సర్వీస్ పేరుతో జరుగుతున్న నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'అపరిచితులు విదేశాల నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెప్పి మాటలు కలుపుతారు. ఆ కాల్ కట్ చేశాక మరో అపరిచిత నంబర్ నుంచి ఫెడ్ ఎక్స్ కొరియర్ సర్వీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని పరిచయం చేసుకుంటారు. మీ పేరుతో ఒక పార్సిల్ వచ్చిందని చెప్పి నమ్మిస్తారు. నాకు కొరియర్ రావాల్సిన వస్తువులేవీ లేవని చెప్పినా.. అపరిచిత వ్యక్తులు మీ పేరు, ఫోన్ నంబర్ చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తారు. ఆ తర్వాత ఈ కొరియర్లో డ్రగ్స్, ఎక్స్‌ప్లోజివ్ వస్తువులు ఉన్నాయని భయభ్రాంతులకు గురిచేసి.. ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు సేకరించి మీపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తారు. తర్వాత ముంబై సైబర్ పోలీసులమని చెప్పి స్కైప్ కాల్స్‌లో మాట్లాడుతూ మీకు సంబంధించిన కీలకమైన వివరాలన్నీ రాబడుతారు. ఫైన్ కట్టాలంటూ అకౌంట్‌లలో ఉన్న డబ్బులు మొత్తం లాగేసుకుంటారు. ప్రజలు ఇలాంటి ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి. వెంటనే సమీప పోలీసుస్టేషన్, కుటుంబ సభ్యులతో చర్చించాలి' అని ఎస్పీ సూచించారు. ఎట్టి పరిస్థితిలోనూ వ్యక్తిగత విషయాలు ఎవరితోనూ పంచుకోకూడదన్నారు. సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని కోరారు.

వేరుశనగ పంట పరిశీలన


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

కదిరి అర్బన్: మండలంలోని ఎగువపల్లిలో వేరుశనగ పంటను శుక్రవారం ఉదయం జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పరిశీలించారు. పంటకు తెగుళ్లు ఆశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ–క్రాప్ నమోదును పరిశీలించారు. ఆయన వెంట ఏడీఏ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన రైతు వడ్డే నాగేంద్ర (26) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం పొలంలో సాగు చేసిన వరి పంటను చూసేందుకు వెళ్లిన ఆయన బోరు మోటారు వద్ద సర్వీస్ వైర్ తెగి ముళ్ల కంచెపై పడిన విషయం గమనించకుండా తాకాడు. దీంతో షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. రైతులు గమనించి కుటుంబసభ్యులతో కలసి బళ్లారికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.